




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -20-

*"ఈ జీవితానికీ నాకూ ఎప్పుడూ యుద్ధమే. ఆ యుద్ధపు చరిత్రే, నా చరిత్ర. నాకు బుద్ధి తెలిసినప్పటి నుండి, ఈ లోకం, ప్రతి ప్రాణికీ ఏ భయమూ, ఏ బాధా, ఏ దుఃఖమూలేని, క్రీడారంగం అయి ఉండాలనీ విశ్వాసం ఏర్పడ్డది. అయితే, నేను గమనిస్తున్న కొద్దీ, ఇది ఏ క్రీడారంగమూ కాదు కదా, రణరంగం! ప్రతి నిముషమూ అన్ని విధాలా దెబ్బలు తింటున్న రోగుల బాధా రంగంగా తెలిసింది. అందుకే నాకు, నా బాధతోనే కాదు.. ఈ లోకంలోని బాధ అంతటితోనూ, చీకటి అంతటితోనూ, నిరంతర పోరాట మార్గం. అందుకే ఈ చరిత్ర బాధార్ణవం. ఈ నాటికీ నేను తెలుసుకున్నదేమిటంటే, ఒక్కొక్కరూ, ఒక్కొ క్క 'ఇంక్లినేషన్'తో పుడతారు. 'అది ధర్మమూ' అని నిర్ధారణ చేసుకునేందుకు ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తారు. కానీ, ఒక్కొక్క కాంక్ష ఏం చేసినా వదలదు. అది, ఎన్ని జన్మల నుంచి తెచ్చుకున్నదో అనిపిస్తుంది. చివరికి ఏ తపస్సులోనో, ఆ మనిషి భస్మం అయ్యేటప్పుడు, భస్మం కావలిసిందే ఆ కోరిక. కొన్నిసార్లు అప్పటికి కూడా కాదు. నేను పదేపదే చెప్పేది ఒక్కటే. నేను చేసిన పనులూ, నేను రాసిన రాతలూ ఇవేమి ప్రజా సంస్కరణ కోసం కాదు. నన్ను నేను సంస్కరించుకోవడానికి మాత్రమే "*

ఈ వాక్యాలు చలంగారు, వివిధ సందర్భాలలో, తన రచనలలో వెలిబుచ్చిన భావాలు. అర్థం చేసుకున్నవారికి చలం – తాను అంతులేని అశాంతితో దగ్ధమవుతున్నా, నిరంతరం కరుణ కురిపించే విశాల గగనం. అర్థం చేసుకున్నవారికి చలం – తాను నమ్మిన విలువల వ్యాప్తి కోసం, నిరంతరం జ్వలించిన కంచు కాగడా. అర్థం కాలేదన్న వారికి చలం, అర్థం కాదనుకున్న వారికి చలం – సంపూర్ణ అయోమయం, అంతూ దరి లేని చీకటి సముద్రం. అర్థం అయ్యాడనుకున్నా, అర్థం కాలేదనుకున్నా, అప్పటికీ, ఇప్పటికీ చలం – ఒక నిత్య సంచలనం...!!

ఈ భాగంలో చలం గారి లేఖా సాహిత్యం గురించి తెలుసుకుందాం...

దూర తీరాల్లో ఉన్న ఇద్దరు మాట్లాడుకోవాలంటే, ఇప్పుడైతే, వాట్సాప్, ఫేస్ బుక్, ఈ–మెయిల్ ఇలాంటివన్నీ ప్రధాన వాహకాలుగా మారాయి. ఇప్పుడు ఉత్తరాలూ, జవాబులూ అంటే, అదేదో పాత కాలపు వ్యవహారంగా అనిపిస్తుంది. కాకపోతే, ఉవ్వెత్తున ఎగసిన సాంకేతిక మానవ సంబంధాలలోని సున్నితత్వాన్ని కబళించక పూర్వం, కొన్ని దశాబ్దాల క్రిందటి వరకూ దూరాలను కలిపిన దారాలు ఉత్తరాలు. చరిత్ర పుటల్లో చెరిగిపోని తీపి గుర్తులు ఉత్తరాలు. బంధు మిత్రులకు కార్డు రూపంలోనో, కవరు రూపంలోనో ఉత్తరాలు రాయడం, సమాధానం కోసం ఎదురు చూడ్డం, అక్షరాలతో భావాలను వ్యక్తీకరించడం, అదంతా మధురమైన అనుభూతులకు ఆలవాలమైన కాలం. మరి చలంగారి కాలం అంటే, వందేళ్ల క్రిందట. దూరాల్లో వున్న మనుషుల్ని, చేరువ చేసేవి ఉత్తరాలు మాత్రమే.

చలం గారి ఇతర సాహిత్య ప్రక్రియలు ఎంత ప్రజాదరణ పొందాయో, ఆయన వివిధ కాలాల్లో మిత్రులకు రాసిన ఉత్తరాలు కూడా, తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. తెలుగు రచయితల్లో చాలా మంది ఉత్తరాలు రాసారు. కానీ, చలంగారి ఉత్తరాలకి ప్రత్యేకతలకే, ప్రత్యేకత వుంది. సాధారణంగా ఆ ఉత్తరాలు రాసే క్షణాల్లో, తర్వాత అవెప్పుడో అచ్చవుతాయనీ, అవి అందరూ చదువుతారని అనుకోరు కదా! అందువల్ల చలంగారు మిత్రులకు రాసిన ఉత్తరాల ద్వారా, పొరలూ, తెరలూ లేకుండా, ఆయన వ్యక్తిత్వాన్ని, ఆలోచనలనూ తెలుసుకోవచ్చు. వివిధ సందర్భాలలో ఆయన భావోద్వేగాలనూ, వివిధ సంఘటనలకు స్పందించిన విధానాలనూ, వీటన్నిటినీ కూడా స్వచ్ఛంగా, సూటిగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. చలంగారి ఉత్తరాలు ఆయన నిజాయతీకి నిలువెత్తు నిదర్శనం. ఒక వైపు ఉధృతంగా రచనలు చేస్తూ, వ్యక్తిగత జీవితంలోని అనేక ఒడిదుడుకులకు లోనవుతూ కూడా, అనేక మందికి వందలాది ఉత్తరాలు రాసి, వాటికి సాహిత్య విలువలు కలిగి, పది కాలాలు నిలబడే భావ పటిమ కలిగిన లేఖలు రాసిన ఏకైక రచయత చలం గారేనేమో..!?

1927 నుండి 77 వరకూ అంటే, 50 సంవత్సరాల వ్యవధిలో చలంగారు రాసిన ఉత్తరాలనన్నిటినీ దాదాపు 15 సంకలనాలుగా ప్రచురించారు. అంటే, యెంత వేగంగా అందరికీ సమాధానాలు ఇచ్చేవాళ్ళో అర్థం చేసుకోవచ్చు. ఆ

రోజుల్లో చలంగారికి వుత్తరం వ్రాయడం అన్నా, ఆయన దగ్గర నుండి సమాధానం పొందడం అన్నా, చాలా భాగ్యంగా భావించేవాళ్లు. చలంగారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపిన కొంత మంది గురించి ప్రస్తావించుకుందాం. చలంగారు మొట్టమొదటసారిగా ఉత్తరాలు రాయడం ప్రారంభించింది , 1927 నుండి. 54 వరకు అంటే 27 సంవత్సరాల పాటు రాసారు, చింతా దీక్షితులు గారికి. ఆయన చలం గారి జీవితంలోని ముఖ్యమైన మలుపులు కారణం అయ్యారు. ఆయనకు ప్రియమిత్రుడూ, మార్గదర్శి కూడా దీక్షితులుగారే.

అలాగే చిన్నారావు గారికి 47 నుండి 59 వరకూ వ్రాశారు. అందరికంటే, ఎక్కువ కాలం చలంగారి నుండి ఉత్తరాలు అందుకున్న మిత్రుడు "బంకుమల్లి రామజోగారావు" గారు. ఆయన 47 నుండి 77 వరకు అంటే 30 సంవత్సరాల పాటు ఉత్తరాలు అందుకున్నారు. అలాగే మరొకాయన ఎస్. వీరేశలింగంగారు, ఆయన 52 నుండి 75 వరకూ 23 ఏళ్ళ పాటు అందుకున్నారు. బి. వి. నరసింహారావు గారు ( "బాల బంధు") , ఆయన 50 నుండి 77 వరకూ 27 సంవత్సరాలపాటు అందుకున్నారు. ఈ జాబితా ఇలా చదువుకుంటూ వెళితే, వంద నుండి నూట ఏభై వరకూ ఉంటుంది.

చలంగారి నుండి సుదీర్ఘ కాలం పటు ఉత్తరాలు అందుకున్న వాళ్ళ పేర్లు మాత్రమే చెప్పాను. చలం అరుణాచలం వెళ్ళాకనే చాలామందికి ఉత్తరాలు రాసారు. ఆంధ్రదేశంలో ఉండగా చింతా దీక్షితులు గారికీ, మరికొంత మందికి మాత్రమే రాసారు. ఆయన జీవించినంత కాలమూ, అంటే ఉత్తరాలు రాయగలిగినంత కాలమూ ఎక్కువగా రమణస్థాన్ నుండే రాశారు. సాధారణంగా మనం ఏదైనా చలం గారి పుస్తకం చదివాం అనుకోండి. అవి, చలం భావాలా, లేకపోతే పాత్ర భావాలా అనేది కొన్నిసార్లు సంశయం కలగవచ్చు. చలంగారే, కాదు. ఏ రచయిత అయినా అంతే. అయితే, ఉత్తరాలు చదివితే గనక, అవి, ఖచ్చితంగా ఉత్తరాలు రాసిన వ్యక్తి భావాలే ఐఉంటాయి..

అందుకని చలం గారు ఏమంటారంటే... "లేఖకుడు (అంటే, వుత్తరం రాసేవాడు)ఏ సంకోచమూ లేకుండా, విషయాన్ని గురించి, తన హృదయంలో రహస్యాలనూ, మనుషుల గురించి నిజమైన అభిప్రాయాలనూ వెలిబుచ్చుతాడు. వ్రాతలో, స్వేచ్ఛ, నేచురల్ నెస్ ఉంటుంది. బ్రతికి వున్న మనిషి గురించి, నిజం తెలుసుకోవాలంటే, అతని ఉత్తరాలు చదవాలి. ప్రయివేట్ టాక్స్ వినాలి. చచ్చిన మనిషి నిజమైన స్వభావం తెలుసుకోవాలంటే, అతని లేఖలు, ముఖ్యంగా ప్రైవేట్ లెటర్స్ చదవాలి. బైరన్ లేఖలు చదవండి. అతని కవిత్వంలో స్పష్టం కాని, అతని గర్వమూ, స్వార్ధ పరత్వమూ, ఈర్ష్యా, నిర్లక్ష్యమూ 'కాన్ టెంప్' అన్నీ కూడా తెలిసిపోతాయి. " అని.

ఉత్తరాలు రాయడంలో గనక నిజాయితీ ఉంటే, అతని వ్యక్తిత్వాన్నీ, స్వభావాన్నీ తెలుసుకోవడానికి వీలవుతుంది – అనేది ఆయన స్వయంగా వెలిబుచ్చిన అభిప్రాయం. చలంగారు ఆంధ్రదేశంలో ఉండగా చాలా

ఊర్లలో ఉద్యోగాలు చేసారు. ఆయన ఎక్కడకు వెళ్లినా చింతా దీక్షితులు గారికి ఉత్తరాలు రాయడం కొనసాగిస్తూనే వున్నారు. ఊరిపేరూ, సమయం కూడా రాసేవారు. ఎక్కువమందికి ఆయన అరుణా చలం వెళ్లిన తర్వాత "రమణస్థాన్ " అనే రాశారు.

చలంగారి ఉత్తరాల్లో కూడా ఏదో "ఉభయకుశలోపరి" అన్నట్లుగా ప్రారంభించి, జమా, ఖర్చులూ, తిధి వార నక్షత్రాలూ, గణాంకాలూ ఇలాంటివి ఏవీ ఉండవు. ఆయన ఉత్తరాల్లోని భావాల్ని, సార్వజనీనమై అందరూ చేసుకునే విధంగా అక్షర బద్దం చేశారు. ఉత్తరాల్లో చాలా అంశాలు స్పృశించారు. రచయితల గురించి, పుస్తకాల గురించి, తాను రాసిన రచనల గురించి, పత్రికల గురించి, ఆధ్యాత్మిక విషయాలూ, డబ్బులూ, జంతువులూ, పక్షులూ, స్థలాలూ ఆహారపు అలవాట్లూ, అలాగే తన గురించి తాను. సినిమాలూ, సంగీతమూ, రేడియోలూ ఇలా అనేక అంశాల గురించి ప్రస్తావించారు. అలాంటి వాటిలో కొన్నిటిని పరిచయం చేస్తాను.

ముఖ్యంగా ఆయన చిరకాల మిత్రుడు చింతా దీక్షితులుగారి గురించి ఒకసారి గుర్తు చేసుకుందాం. చింతా దీక్షితులుగారు 1920 నుండి ఎక్కువగా పిల్లల కథలు రాశారు. చిన్న పిల్లల గురించి బొమ్మలు ఎక్కువగా వేశారు. ఆయన చలంగారి కంటే 5 ఏళ్ళు పెద్ద.

రాజమండ్రిలో చలం గారు వుద్యోగం చేసేటప్పుడు ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ ద్వారా అక్కడే పరిచయం అయ్యారు. చలం గారు రచనలు చేసే కొత్తలో ఆయనే రాయమని ప్రోత్సహించినదీ, వాటిని పని గట్టుకొని పత్రికలకు పంపించినదీ ఈ చింతా దీక్షితులు గారే. అదొక్కటే కాదు, ఆ తరువాత చలంగారి జీవితంలో అతి ముఖ్యమైన మలుపులకీ ఆయనే కారణం. 1930 ప్రాంతాల్లో, చలం గారి పెద్దబ్బాయి చనిపోయాక, చలం గారికి జాతకాలూ, యోగాసనాలూ వీటి మీద నమ్మకం కుదిర్చిందీ, చలంగారికి రమణ మహర్షిని పరిచయం చేసింది దీక్షితులుగారే. చలంగారు ఆంధ్రదేశంలో ఉండగానే, చింతా దీక్షితులుగారికి రాసిన ఉత్తరాలు రెండు సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. ఆ తరువాత 'తిరువణ్ణా మలై' వెళ్ళాక మరికొన్ని సంపుటాలు వచ్చాయి. మొట్టమొదట 1944 లో ఉత్తరాలు సంపుటం పబ్లిష్ అయినప్పుడు దానికి ముందుమాట రాస్తూ ఇలా చెప్పారు

"1944 జనవరి 1 వ తేదీ,

చింతా దీక్షితులుగారు ఈ ఉత్తరాలు దాచారు. ఆయన శ్రమ ఎవరికి ఉపకరిస్తుందో తెలీదు. ఈ ఉత్తరాలన్నీ నేను ఇంగ్లీష్ లో రాశాను. చేతగాని చోట్ల తప్ప, మిగిలినవి తెలుగులో తర్జుమా చేసి మీకు అందిస్తున్నాను. ఇతరులను గాయ పరుస్తాయని అనుకున్నవీ, అధికారులను వరసగా పేర్లు పెట్టిన తిట్లూ, రెండు, మూడు చోట్ల బూతులూ తప్ప, మిగిలిన విషయాలన్నీ వున్నది, ఉన్నట్లుగా తెనిగించాను. ఈ ఉత్తరాల్లో నేను వెలిబుచ్చిన అభిప్రాయాలు, అప్పటికి నావి. ఈనాటికి చాలా వాటిల్లో మార్పులు చెందాయి. చెందుతున్నాయి."

ఈ ఉత్తరాలన్నీ పబ్లిష్ చేసేటప్పుడు చింతా దీక్షితులు గారు "ఈ ఉత్తరాలన్నీ నేను దాచడానికి కారణం, నాకు కీర్తి తెచ్చుకుందామని కాదూ, వెంకట చలానికి కీర్తి తెద్దామనీ కాదు. నేను ప్రేమించిన స్నేహితుల్లో చలంగారు ముఖ్యులు. నా ప్రేమకు బదులు, ఆయన నుంచి, కావలిసినంత దొరికింది. ఈ ఉత్తరాల్లోని నిష్కాపట్యమూ, ప్రేమా, హాస్యమూ, హృదయవేదనా ఆకర్షించాయి. పై కారణాలవల్లనే అతని ఉత్తరాలు దాచాను.ఇవి ఎప్పటికైనా ముద్రణకొస్తాయని మేమిద్దరమూ కూడా అనుకోలేదు. ఈ ఉత్తరాలు చదివితే వెంకటచలం హృదయానికి దగ్గరగా పోవచ్చును. దాని, లోతూ వైశాల్యమూ తెలుసుకోవచ్చు. వారి సారస్వత కృషికి పురిగొల్పిన ఉద్వేగం ఇందులో గమనించవచ్చు. "అన్నారు.

ఈ ఉత్తరాలు చదివితే, చలం గారు వివిధ సందర్భాలలో, వివిధ రచనలు చేసేటప్పుడు ఆయన యొక్క మానసిక స్థితి ఎలా వుంది? ఎలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు? ఇలాంటివన్నీ కూడా తెలుస్తాయి. చింతా దీక్షితులుగారికి రాసిన అన్ని ఉత్తరాల్లో కూడా, ఒక్కో ఉత్తరంలో ఒక్కో విధంగా సంభోధిస్తుండేవారు.

మచ్చుకి కొన్ని ఉత్తరాలు చూద్దాం.

1928 నవంబర్ 16, గుంటూరు

డియర్ ఫ్రెండ్,

నా కథల మీద పత్రికల్లో రాసే విమర్శలు మహా ఉల్లాసంగా ఉంటాయి. నాకూ, దేశానికి జ్ఞాన బోధకంగా ఉంటాయి. మొత్తానికి అశ్లీలం వ్రాసే వెంకటచలం అనేవాడు ఇంకా వున్నాడని, జ్ఞాపకం చేస్తూ ఉంటాయి. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక వాళ్ళు కథ పంపమని అడిగారు నన్ను. "త్రీ చీర్స్ టు జి.వి "(జి.వి అంటే గుడిపాటి వెంకటచలం) ఇంత కాలం పని చేసి శ్రమ చేశానని, పెన్షన్ తీసుకుందామని ఆలోచిస్తున్నాను. నేను వెళ్ళిపోతానంటే, నాకు రావలిసినదాని కంటే, ఎక్కువ పెన్షన్ ఇస్తారనుకుంటాను. వీడు వెళ్ళిపోతున్నాడు గదా! అనుకోని."

చలంగారు రాసిన మొదటి నవల "శశిరేఖ"అది కూడా ఆ రోజుల్లో సంచలనం కలిగించింది. దానికి "శివశంకర శాస్త్రి"అనే ప్రఖ్యాత రచయత ముందుమాట రాసినప్పుడు ఆయన్ని అందరూ కోప్పడ్డారు. ఆ విషయాన్ని చింతా దీక్షితులుగారికి రాసిన ఉత్తరంలో ప్రస్తావించారు.

"సర్లే, ఆ క్రేక్ అలాంటి పుస్తకం రాసాడనుకో, అంతకన్నా మంచిది రాస్తాడని మేం ఎప్పుడన్నా అనుకున్నామా? కానీ, మర్యాదస్తుడివీ, బుద్ధిమంతుడివీ, నువ్వు అతన్ని సమర్ధిస్తావా? వెనకేసుకు వస్తావా? అతని లాగే నువ్వు కూడా చచ్చు వ్యభిచారంలో మించి పోయావే " అని అంటున్నారు. పాపం శివశంకర శాస్త్రిని " అని రాశారు.

ఆ రోజుల్లో చలంగారు బెజవాడలో ఒక స్కూల్ పెడదామని అనుకున్నారట. ఆ విషయాన్ని ఇలా రాశారు.

గుంటూరు, 1930 జూలై 8,

డియర్ నస్య ఘాతకా... నా భవిష్యత్ కీర్తి మందిరానికి వచ్చే వారం పునాది వెయ్యిబోతున్నాను. అంటే,ఒక పాఠశాల స్థాపిస్తున్నాను. ఒక తరగతి, ఒక ఉపాధ్యాయని, ఒక విద్యార్థిని. ఆ సంస్థకు నేనే ప్రిన్సిపాల్, మాలతీబాయి గారు వైస్ ప్రిన్సిపాల్, బోర్డర్లను కూడా తీసుకుంటాం. ఈ ఏటికి 5,7 మధ్య వయసు పిల్లల్ని మాత్రమే."

ఆ స్కూలు పెట్టలేదు. ఇందులో రాసిన మాలతీబాయిగారంటే, ఎవరో కాదు, ఆయన భార్య రంగనాయకమ్మ గారే. ఆవిడ బ్రహ్మ సమాజంలో చేరాక మాలతీబాయి అని పేరు మార్చుకున్నారు.

బెజవాడ, 1930 ఆగస్టు 10,

మై డియర్... ఫైనాన్షియల్ అడ్వయిజర్ టు ద గవర్నమెంట్,

ఈవాళ ఉత్తరం రాద్దామంటే ఆదివారం, కవరు లేదు. నర్సారావు పేట వెళ్ళానంటే, 'వుమన్ బచ్చా' గాడు, స్నేహితులకు కూడా ఉత్తరాలు రాయనివ్వడు. అక్కడ టీచర్లూ, విద్యార్థులూ, నా అనుచరులూ.. అతను ఒంటరి అయిపోయాడు. నన్నెట్లా వదిలించుకోవాలా అని, వాళ్ళకీ, వీళ్లకీ మొక్కుకుంటున్నాడు. (ఆయన అప్పట్లో నర్సారావుపేటలో పని చేస్తున్నారు. అక్కడ హెడ్ మాస్టారుకి చలంగారిని యెట్లా వదిలించుకోవాలా అనేది పెద్ద శ్రమ. ఆ విషయాల్ని వివరిస్తూ చింతా దీక్షితులు గారికి ఇంకా ఏ చెబుతారంటే) నేనేమీ రాయడం లేదు. మొదటిసారి నా జీవితంలో ఏ ఆశయమూ, ఏ ప్రయత్నమూ లేకుండా నావంటి యువకుడు ఎట్లా సుఖంగా బ్రతకాలో అలా బ్రతుకుతున్నాను. తినడమూ, నిద్ర పోవడమూ, కబుర్లూ, వేళాకోళాలూ తిరగడమూ చాలా హాయిగా అందంగా వుంది. నర్సారావు పేట నీలాకాశం. "అని రాసారు.

అలాగే మరొక వుత్తరం.

1931 నవంబర్ 14

పైన డామ్ బ్లడీ స్కూల్, మై డియర్ కో–సఫరర్,

మాలతీబాయి గారు మునిసిపల్ కౌన్సిలర్ అయి, ఊరంతా హడావుడి చేస్తున్నారు. రోజూ రెండు రూపాయలు ఖర్చు చేస్తూ, తీవ్రంగా బీమా పని చేస్తున్నారు. నా కింద తొమ్మిది మంది జీతాలు తీసుకునే నౌకర్లు (ఆ రోజుల్లో వదిన రంగనాయకమ్మగారు ప్రాక్టీస్ పెట్టి, బాగా పేరు తెచ్చుకున్న రోజుల్లో చలంగారి వైభవం అలా ఉండేది.) జీతం లేని కుక్కా, ఇంకోటి చచ్చిపోయింది. ఒక గొర్రె, రెండు పర్మనెంట్ పిల్లులు. రెండు పార్ట్ టైమ్ పిల్లులు. ఇంకో రెండు పిల్లులు. రాత్రి మాత్రమే వాటికి. లెక్కలేనన్ని చేపలు పెంచుతున్నాను. వచ్చే నెల గుర్రాన్ని కొనబోతున్నాను. ఈ మధ్య

నా కథ పత్రికల్లో ప్రచురించారు. ఇన్ స్టాల్ మెంట్లుగా. వకీలు గారి భార్య లేచిపోవడం, వూర్లో పెద్దమనుషుల గోల. సంపాదకుడ్ని బెదిరించి, ఆ కథ ఆపించేశారు. “

ఇలా చాలా ఆసక్తికరమైన విషయాలు రాసారు. చలంగారు ఎన్నెన్ని భావోద్వేగాలకూ, ఎన్నెన్ని ఎత్తు పల్లాలకు లోనయ్యారో తెలుస్తుంది.

అలాగే, 1936లో చలం గారిని, చింతా దీక్షితులుగారు తిరువణ్ణామలై తీసుకువెళ్ళి, రమణ మహర్షి ని పరిచయం చేశారు. చాలా మంది ఏం అనుకుంటారంటే, చలంగారు రమణ మహర్షిని చూడగానే, వెంటనే ఆయన భక్తుడైపోయాడని. కానీ, చలంగారు, చింతా దీక్షితులు గారికి రాసిన ఉత్తరాలు చదివితే, చలంగారు రమణమహర్షికి ఆకర్షితులవ్వడం అనేది ఒక క్రమ పరిణామంలో జరిగిందని అర్ధమవుతుంది. చలంగారు కొన్ని సందిగ్ధ సమయాలను దాటుకుంటూ వెళ్ళాక రమణ మహర్షి బంధనాల్లోకి వెళ్లారు. అవన్నీ కూడా ఉత్తరాల ద్వారా తెలుస్తాయి.

1937లో , అంటే, చలంగారు, రమణ మహర్షి దగ్గరకు వెళ్లి వచ్చిన, మరుసటి సంవత్సరం చింతా దీక్షితులు గారికి రాసిన ఉత్తరంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చెప్పారు. రేపల్లెలో ఎవరో ఒకతను చనిపోతే, రమణ మహర్షి భక్తులు.“మేము శవాన్ని రమణ మహర్షి దగ్గరకు తీసుకువెళాతాం. ఆయన బ్రతికిస్తారు. మాకా నమ్మకం వుంది” అన్నారట.

“మీరు అన్నట్లే అయింది. శవాన్ని, భగవాన్ దగ్గరకు తీసుకువెళ్లారు. రాత్రి 11 గంటలకు ఆయన్ని లేపి ఉండాలి. ఆయన ఏం మాట్లాడలేదట. వండర్ ఫుల్ మాన్. నిరంజన్ తెల్లారేక చూడమన్నాడు. (నిరంజన్ అంటే, భగవాన్ పక్కనున్న వ్యక్తి. ) భగవాన్ కి అసాధ్యమైనది ఏదీలేదు. కాకపోతే, ఉద్దేశ్యం మనకు తెలీదు. “తెల్లారేవరకూ ఉంచండి. అప్పటికీ బ్రతక్కపోతే, పాతేయ్యండి. “అని చెప్పారట. ఏమీ కాలేదు. చనిపోయినటువంటి మనిషి బ్రతికి రాలేదు. “ఇట్స్ నాట్ ఓన్లీ గ్రేట్. బట్ ప్రూడెంట్ ఆఫ్ భగవాన్.“ గొప్పేకాదు. వివేకం కూడా. అంటే. ఆయన మహత్యం చూపించి బ్రతికిస్తే, ఇండియా లో వున్న పీనిగలన్నీ రోజూ ఆశ్రమానికి రవాణా అయ్యేవి. “ అని రాసారు చలంగారు.

అలాగే ఆయన నెల్లూరులో పని చేసేటప్పుడు చాలా విచిత్రమైన వాక్యాలు రాసారు.

1937 మార్చి, 9,

ఈ నెల్లూరులో నాకేం దొరుకుతాయి? చేపలు తప్ప ఏమీ దొరకవు. నెల్లూరు నెరజాణలు ఉత్త మిత్. ది పాస్ట్ వన్స్ ఆర్ ది లూజ్ వన్స్ ఆర్ అగ్లీ నేస్టీ. పిచ్చయ్యరు, నన్ను ఆడపిల్లల బడి ఎందుకు మాన్పిస్తాడు. వివాహం గురించి నా అభిప్రాయాలు ఇలాంటివని కంప్లయింట్ చేస్తున్నాడట. నేను, బళ్ళో భోగం అమ్మాయితో సరసాలు ఆడుతున్నానని, సుబ్రహ్మణ్యం గారు పైకి రాసాడు. “

అలాగే ఆయన రమణ మహర్షి దగ్గరకు వెళ్లి వచ్చాక, ఒక ధ్యానాన్ని ప్రారంభించారు. ఆ ధ్యానాన్ని ప్రారంభించినపుడు, 'హిస్టీరియా లాగ వస్తోంది" , అని విశాఖపట్నంలో వుద్యోగం చేసేటప్పుడు చింతా దీక్షితులు గారికి రాసారు.

1937 జూలై, 5, విశాఖపట్నం,

ఈ ధ్యానం ప్రారంభించిన తర్వాత హిస్టీరియా లాగ వస్తున్నాయి నాకు. ప్రాణాయామం మూలంగా కుండలినీ చేసేటప్పుడు ఇలాంటివి సంభవిస్తాయని చదివాను యోగ పుస్తకాల్లో. ఈ స్థితిలో నాకు స్మృతి, శుభ్రంగా, మామూలుగా ఉంటుంది. కానీ, శరీరం వణుకుతుంది. శ్వాస తీవ్రం అవుతుంది. నా స్వాధీనంలో ఉంటుంది. "ఫినామినా" నేను నుంచి, నా మనసు తీసేస్తే, మాములుగా అయిపోతాను. భయం లేదు లెండి. భగవాన్ కనిపెడుతూనే వున్నారు. గొప్ప ఆనందం ఏమీ రాదు. కానీ, ఆ ఫిట్స్ అయిపోయిన తర్వాత కొత్తగానూ, శాంతంగానూ ఉంటోంది. ఇంకో ఒకటి, రెండు పళ్లతో తద్దినాలూ, పూజలూ చేసే మూర్ఖాచారపరాయుడైన బ్రాహ్మణుడిగానో, బూడిద పూసుకు తిరిగే బైరాగి గానో తయారవుతానా? మీరూ, సుబ్బారావు గారూ నన్ను చూసి, "ఏమోయ్! నిరీశ్వరవాదీ! ఆంధ్రదేశ అపనమ్మకాధ్యక్షా ఏం చేస్తున్నావు? అని వెక్కిరిస్తారు గావున్ను" ఇదంతా కూడా చలం గారు రమణ మహర్షి మీద విశ్వాసం పెంపొందించుకునే క్రమంలో ఆయనకు కలిగిన భావాలు. మరో రెండు ఉత్తరాలు.

1937 జూలై 6

విశాఖపట్నం

నేను చాలా అదృష్టవంతుడ్ని. భగవాన్ నన్ను పట్టుకున్నారు చివరికి. g.v. (గుడిపాటి వెంకట చలం ) ద గర్ల్ హంటర్ అండ్ స్టోరీ రైటర్. హిజ్ గోయింగ్ టూ డై. స్త్రీ కాముకుడూ, కథకుడూ చలం చచ్చిపోబోతున్నాడు. అప్పుడే భగవాన్ కొంచెం తినేశారు. అతనిలో ఈశ్వర సందేహంలో, శృంగార తత్వంలో మునిగి, బీరు తాగి, మాంసం తినే ఆడవాళ్లను, బీర్ డ్రింకింగ్, మటన్ ఈటింగ్, గర్ల్ కిస్సింగ్ g.v. G. V. లో ఆత్మ ఉందని గుర్తించగలిగింది మీరు. అవును మీరు ... మీరు... నాకేదో సాక్షాత్కారం అయిపోయిందని అనుకోకండి. నాలోని ఈ కాస్త మార్పే గాలిని మరింత చల్లగానూ, కాంతిని తేజోవంతం గానూ, సముద్రాన్ని ఇంకా నీలంగానూ మార్చింది. ద్వేషాలు కరగిపోయున్నాయి. తోటి మానవులమీద కొత్త ప్రేమ ఉదయించింది. చివరికి ట్రైనింగ్ స్కూల్ నాకు 'టెబర్నికల్' అయ్యింది. భగవాన్ నన్ను నిజంగా స్వీకరిస్తాడంటారా?"

అక్కడకు వెళ్లి వచ్చిన ఒక సంవత్సరానికి "మీరురండి మనిద్దరం కలసి అరుణా చలం వెళదాం "అని చాలా ఉత్తరాల్లో రాసారు.

"ఫ్రమ్ ద్రోణాచలం, సమ్ బడీ కమ్స్ టూ వెంకట చలం టు టేక్ హిమ్ టు అరుణా చలం"అని సరదాగా రాస్తూండేవారు చాలా ఉత్తరాల్లో. అయితే, చలం గారు రమణ మహర్షి దగ్గరకు వెళ్ళాక, చింతా దీక్షితులు వెళ్లారు గానీ, చలం గారి పెద్దమ్మాయి సౌరీస్ కి ఈశ్వర దర్శనం అయ్యిందనే వాదాన్ని మాత్రం చింతా దీక్షితులు గారు విశ్వసించలేదు. అందుకని చలంగారు పలుమార్లు " మా దగ్గరకు రండి. మాకు ఈశ్వర దర్శనం అయింది."అని అన్నాగాని, దీక్షితులు గారు వెళ్ళలేదు.

చింతా దీక్షితులు గారికి చాలా జబ్బు చేసినప్పుడు కూడా, వాళ్ళ అబ్బాయి, నర్సాపురం వెళ్లి వైద్యం చేయించుకున్నారు గానీ, అరుణాచలం మాత్రం వెళ్ళలేదు. ఆ సందర్భంలో చలంగారు, చింతా దీక్షితులు గారికి రాసారు "మీరు రండి. భగవాన్ మీద నమ్మకం ఉంచండి. మాకు ప్రత్యక్షం అయిన ఈశ్వరుడే భగవాన్ అయి ఉండవచ్చు. "అని రాసారు.

చాలా విచిత్రంగా ఉంటుందీ పరిణామం. మొట్టమొదటి దశలో చింతా దీక్షితులు గారు, చలం గారిని తీసుకువెళితే, తరవాత దశలో చలంగారు, చింతా దీక్షితులు గారిని బ్రతిమిలాడారు. "మా దగ్గరకు రండి "అని. అది జరగలేదనుకోండి. 1960 లో చింతా దీక్షితులు గారు మరణించారు. సుదీర్ఘకాలం చలం గారి దగ్గర నుండి ఉత్తరాలు అందుకున్న వ్యక్తి. ఇప్పటికి కూడా చలంగారు దీక్షితులుగారికి రాసిన ఉత్తరాలు పుస్తకరూపంలో మార్కెట్ లో దొరుకుతున్నాయి. చలంగారి సాహిత్యాన్ని ఇష్టపడేవాళ్లు, తప్పని సరిగా ఈ లేఖా సాహిత్యాన్ని చదవాలి. వాటిద్వారా చలం గారు ఎంతగానో అర్ధమవుతారు.

చలం గారు ఉత్తరాలు రాసినటువంటి మిత్రుల్లో మండువ జగ్గారావుగారు ఒకరు. ఆయనకు 1958 నుండి 64 వరకు రాసారు. కేవలం 6 సంవత్సరాలే అయినప్పటికీ, ఆ జగ్గారావుకి రాసిన ఉత్తరాల్లో చాలా విలువైన సమాచారం మనకు దొరుకుతుంది. ఎందుకంటే, ఆ 6 సంవత్సరాల్లో రమణ స్థాన్ లో ఉండగా అనేకమైన మార్పులు సంభవించాయి. అలాగే ఆ రోజుల్లోనే ఆయన సరికొత్త సాహితీ ప్రక్రియలోకి అడుగుపెట్టారు. అలాగే ఆయనకు వున్న ఆర్ధిక ఇబ్బందులు ఎలా వున్నాయనేవి ఈ ఉత్తరాల్లో మనకు తెలుస్తుంది. కొన్ని చూద్దాం...

1958 ఏప్రిల్ 6

జగ్గారావు గారికి,

మీ నుండి వుత్తరం వచ్చింది. మీ పేరు జ్ఞాపకం లేదు. కానీ, మీరు జ్ఞాపకం లేకేమి. లీల గారు చనిపోయినట్లు తెలుసా మీకు? మీరు చదివిన ఉత్తరాల్లో ఏం రాసానో జ్ఞాపకం లేదు. అవును నాకు డబ్బు లేదు. ఆస్తి లేదు. కానీ, నాకు అప్పులేదు. కొదవ లేదు. ఎట్లాగో సుఖంగా జరిగిపోతోంది. దేనికీ ఇబ్బంది అనేది లేదు. నా అవసరాలు చాలా తక్కువ. అవి గడిచిపోతున్నాయి. ఆ ఉత్తరాలు రాసినప్పుడు డబ్బు కోసం ఆదుర్దా పడ్డానేమో గానీ,

ఇప్పుడేమీ డబ్బూ లేదూ, ఆదుర్దా లేదు. ఇంటిని ఈశ్వరుడు నడుపుతున్నాడు. మీరు బీదవారే కదూ! అందుకే చలం ఇంకా జ్ఞాపకం వున్నాడు. మీకు చలం కోసం ఆదుర్దా పడే హృదయం ఇంకా మీలో వుంది. మీరొక బీదవారు. అందువల్లనే ఇంకో బీదవారికి సహాయం చేయాలనే కోరిక కలిగింది. పైగా నాపై ఎంత అభిమానమో. మీరు డబ్బివ్వాలా?

నాకోసం ఒక రాత్రి బాధ పడ్డారు, చాలదా.. మీ వంటివారి ప్రేమ. ఏ కొద్ది మందిదో సంపాదించుకున్నాను. తక్కిన ప్రపంచం నన్ను గౌరవించడం కన్నా, ద్వేషించడమే నాకు ఎక్కువ సంతోషం. నా ఆరోగ్యం బాగానే వుంది. అన్నీ సుఖంగా వున్నాయి. అన్నీ ఈశ్వరుడు చూస్తున్నాడు. (ఈశ్వరుడు అంటే ఎవరు? అని ఆ జగ్గారావు అడిగినట్టున్నారు. దానికి సమాధానం చెప్పారు.) ఈశ్వరుడు అంటే ఈ లోకాల ప్రభువు. తక్కిన వివరాలు మీరు ఇక్కడకి వచ్చినపుడు చెబుతాను. మీరేమీ డబ్బు పంపించవద్దు. మీరూ, మిత్రులూ రండి. ----

ఈశ్వరాశీర్వాదాలతో

చలం

అక్కడ నుండి చలం గారు "ఈశ్వరాశీర్వాదాలతో, చలం " అని ముగిస్తుండేవారు. చాలా మంది చలంగారు చాలా ఇబ్బందుల్లో వున్నారనుకొని, "డబ్బులు ఎం.ఓ. చేస్తాం " అని రాస్తే, ఒప్పుకునేవారు కాదు. దానికి ఉదాహరణ. మండువ జగ్గారావుకి రాసిన వుత్తరం.

సెప్టెంబర్ 27, 1958, జగ్గారావు గారికి,

1954 తర్వాత నేను పుస్తకాలు రాయలేదు. నేను ఇప్పుడు టాగూర్ గీతాంజలి తెలుగు చేస్తున్నాను. అది కాక మా పక్షి జీవితం రాస్తున్నాను. తేదీల ప్రకారం. (ఈ పక్షి రాజు అంటే, క్రిందటి భాగంలో మనం చెప్పుకున్న 'బుజ్జిగాడు'డైరీ) గీతాంజలి పూర్తి కావచ్చింది. ఒక 15 రోజుల్లో ప్రెస్ కి పంపుతాను అనుకుంటున్నాను. (చాలా మామూలు విషయాలు కూడా ఆయన ఎంతగా రాసేవారు అనడానికి ఇంకో ఉదాహరణ)

జూన్ 11, 1959

జగ్గారావుకి ,

మీ మొక్కలు బాగానే ఎదుగుతున్నాయి. 'డాలీ' మాట ప్రకారం నీళ్లు పోస్తూనే వుంది. ఇవాళే చెయ్యి వాచింది. మీ ఉత్తరాలన్నీ, ఒక ఒక కవరులో అందాయి. మీరు వెళ్ళాక చూపు, అంటే చదివే చూపు పూర్తిగా పోయింది. కనక ఉత్తరాలు చదవడం కష్టం. రాసేటప్పుడు, వచ్చిన ఉత్తరాలు ఎదుట పెట్టుకుని గానీ, నేను జవాబు రాయలేను. 'హీరా'

(నెమలి) పిల్లల్ని పొడుస్తానని బెదిరిస్తోంది. 'రంగ' (చిలక) అన్నిటినీ కొరికి పెడుతోంది, తన స్వంత ఒంటిని తప్ప. గిన్నెల్ని కూడా చిల్లులు పడేటట్లు కొరుకుతోంది. "

ఇలా చలంగారు తన వున్న వాతావరణాన్ని కూడా ఎదుటి వారు అక్కడే ఉన్నట్లు భావించుకొని, ఎదుట కబుర్లు చెబుతున్నట్టుగా చక్కగా ఉత్తరాలు రాస్తూండేవారు. అంటే, వీళ్ళందరూ అడిగే వాళ్ళనుకుంటాను, గత జీవితంలో జరిగిన సంఘటనల గురించి చలంగారిని. వాటికి చలంగారు రాసిన సమాధానములు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. మరి వాళ్ళందరూ చలంగారికి రాసినవి ఎందుకు లభ్యం కావడం లేదు అంటే, చలంగారు బెజవాడ వదలి వచ్చేటప్పుడు ఆ జ్ఞాపకాలు ఏవీ ఉంచుకోకూడదు అనుకొని వాటినన్నిటినీ బాయిలర్ లో వేసి, కాల్చేశారు. అంతే కాకుండా రమణ స్థాన్ వచ్చాక కూడా, మిగతా వాళ్ళు రాసిన ఉత్తరాలు ప్రచురణ కాలేదు.

జూన్ 27, 1959 రమణస్తాన్

జగ్గారావుకి,

రాంమూర్తి చనిపోయినప్పుడు అతని ఇద్దరి పిల్లల్ఊ మాతోనే వున్నారు. ఇంక వారు నా పిల్లలే అనుకున్నాను. కానీ, వాళ్ళ తల్లి వచ్చి పిలిచింది. "వెళతాం"అన్నారు. ఆ తరువాత సుఖంగా వున్నారని వినడమే గానీ, మాకేమీ తెలీదు. ఆ తల్లి డాక్టర్. "మాల పిల్ల " కథ నేను రాసిందే. చివరంతా మార్చారు. "గాంధీ నగర్" నేను రాసిందే. సంభాషణలు మాత్రమే. సినిమా రచనకు నన్నెవరూ ప్రోత్సహించలేదు. (ఈ వుత్తరం ప్రకారం చలంగారు 'గాంధీనగర్' అనే ఇంకో సినిమాకు కూడా మాటలు రాసారు. నేను దానికోసం వెతకడం ప్రారంభించాను. ఆరోజుల్లో 'గాంధీ నగర్ 'అనే సినిమా వచ్చింది. 1949- 50 ప్రాంతాలలో. అయితే, దానికి సంబంధించిన మిగతా సమాచారం ఏదీ లభ్యం కాలేదు. ఇంకా ఉత్తరంలో ఏం రాశారంటే,)

"నేను ఆంధ్ర దేశంలో ఉండగా, ఆకాశరామన్న ఉత్తరాలు వచ్చేవి. నేను వాటిని చదవలేదు. కానీ, అటువంటి పనులు చాలా స్వల్పం. తిట్టేవారు, నా మొహం మీదనే తిట్టేవారు. రాయవలసిన అగత్యం ఏముంది? యూనివర్సిటీకీ, గవర్నమెంటుకీ నా గురించి రాసారు. మీటింగులు చేశారు. పిటీషన్లు పెట్టారు నా గురించి, నాపైన. చేయూత ఇచ్చిన వాడు ఒక్కడూ లేడు. నా స్టూడెంటుకి అసలు నేను పుస్తకాలు రాస్తానని కూడా తెలీదు. తెలిసిన వాళ్లకి పట్టలేదు. అర్థం కాలేదు. నా డిపార్ట్ మెంట్ జీవితమంతా విరోధమయమే. కానీ, తీసివేయడానికి కారణం కనపడక, ఊరుకున్నారు. కళ్ళజోడు మార్చడానికి ఏలూరు వెళ్ళాలేమో. బెంగగా వుంది. ఇప్పుడే మీ కార్డు అందింది. పెసరట్టు కూర్మా చేసాను. ఎంతో రుచిగా వుంది. కానీ, ఎంతో శ్రమ. "

ఇంతగా ఆయన భావాలే కాకుండా, ఆ రోజు జరిగినట అతి చిన్న విషయాలు కూడా రాస్తూండేవారు. 1957 లో జగ్గారావుకి రాసినటువంటి ఒక ఉత్తరంలో "మైదానం" నవలను ఆంధ్రా యూనివర్సిటీ పోటీలకు పంపించడం గురించి ఇలా రాసారు.

జగ్గారావు గారికి,

ఇందాకనే మీ వుత్తరం అందింది. ఆ రోజైనా నాకు యూనివర్సిటీ పోటీల్లో గెలవాలని ఉంటే, పంపి... పంపి.. "మైదానం" పంపుతానా? ఎంత మర్యాదైన పుస్తకం అయినా చలం పేరు ఉంటే, ఎవడన్నా బహుమతి ఇస్తాడా? వూరికే అల్లరి కోసం పంపాను. పోటీ కోసమైనా ఆ నీతి పరుల చేత, గొప్పవారి చేత, ఆ పుస్తకాన్ని చదివించాలని నేను పంపించాను. వాళ్ళు చదివారు కూడా. 'రాధా కృష్ణన్' గారు రికమెండ్ చేశారు కూడా. ఉన్నవ లక్ష్మీనారాయణ కూడా అన్నారు. ఇదే ఉత్తమ నవల అని. కానీ, బహుమతి ఇచ్చే సాహసం లేదు. "

విశ్వనాథా, బాపిరాజు పోయి, చలాన్ని తిట్టి బహుమతి పంచుకున్నారు. చివరికి మీ జయపురం రాజా వారు వారికి బహుమతి ఇప్పించారు. ఇంత జరిగింది. హృదయాలున్నాయి. ధైర్యాలు లేవు ఆనాడు. ఈ హృదయాలు కూడా పోయాయి. నాకు కొత్త కళ్ళ జోడు వచ్చింది. కళ్ళు మళ్ళీ వచ్చాయి. వర్షం లేదు. నీళ్లు లేవు. 'పల్లాకుర్తి' లో తాడిన్నరకి వెళ్లాయి నీళ్లు. చివుళ్ళకి నీళ్లు అందడం లేదు. తన మీదకు జారిన నీటి చుక్కనల్లా భూదేవి తాగేస్తోంది. " జగ్గారావుగారు అడిగినట్లున్నారు. "ఏమిటి? అందరూ మీ దగ్గరకు వచ్చి ఉండిపోతారు కదా! వాళ్ళని రమ్మని అడుగుతున్నారా?" అని. ఆ ప్రశ్నకు సమాధానంగా చలంగారు ఇలా చెప్పారు.

"మీరు రాసినదంతా నిజమే. మీ సందేహాలు సరైనవి కావు. ఈ విషయాలు తెలిస్తే, మీ సందేహాలు ముప్పాతిక తీరిపోతాయి. 1. నేను ఎవర్నీ ఇక్కడకు రమ్మనమని పిలవను. పిలవలేదు కూడా. అక్కడ అనేకమైన చిక్కుల్లో పడి కొట్టుకుంటూ "మాకు ఏది గతి?" అని మొరపెడితే, జాలి పడి "సరే! ఇక్కడకు రండి" అంటాను. ఆ చిక్కుల్లో ఉండగా నా పిలుపు వాళ్లకి దివ్యవాణి లాగ వినబడుతుంది. ఆ చిక్కులు తగ్గగానే "ఎంత మోసం చెయ్యాలని చూసాడు చలం." అని కోపగించుకుంటారు. 2. ఇక్కడకు వచ్చిన ఎవరినీ యోగసాధన చెయ్యమని అడగను. 3. ఇంతకీ ఇక్కడకు రమ్మనడానికీ, పొమ్మనడానికీ నేనెవర్ని. పిలిచింది ఈశ్వరుడు. యోగసాధనకి దించేది ఈశ్వరుడు నేనెవర్ని. 4. ఇంతకూ అది నా జాతకం. మంచి చేసినా తప్పు అర్థం చేసుకుంటారు. విరోధులు సరేసరి. 5. ఈ మిత్రులే కాదు. ఈ మధ్య ఇద్దరు, ముగ్గురు ఇట్లాగే చీవాట్లు వెయ్యాల్సి వచ్చింది. "

అలాగే మరొక అభిమాని ఎం.వీరేశలింగం. ఆయనకు రాసిన ఉత్తరాల గురించి తెలుసుకోడానికి, మళ్ళీ కాలక్రమం లో వెనక్కి వెళ్ళాలి. 1952 కి వెళితే, వీరేశలింగం గారికి అప్పటినుండి 15 సంవత్సరాలు చలంగారు ఉత్తరాలు రాసారు.

జూన్, 5, 1952

వీరేశలింగం గారికి,

మీ అందమైన వుత్తరం అందింది. నా కెందుకో నా రచనల్లో చాలా విశ్వాసం వుంది. యుగాల వరకూ కాదు. అప్పుడే మరచిపోయారు నన్ను. నా పుస్తకాలు అచ్చు కావడం లేదు. అదొక దిగులనీ కాదు. (ఇది చలం గారు రమణాశ్రమానికి వెళ్లిన కొత్తలో అంటే, 1952 లో రాసిన వుత్తరం ) నన్ను మరచిపోవాలనే నేను అనుకుంటాను. ఎందుకంటే, ఆంధ్రులకు నా మీద ద్వేషం రేకెత్తడమే. రాయగల శక్తి మీకు లేదంటారేమిటి? ఇంత మంచి వుత్తరం రాసి. అదేంటి, నా పుస్తకాల్నీ, నా స్త్రగుల్నీ అంత బాగా అర్థం చేసుకొని, నా రమణాశ్రమాన్ని చేరుస్తున్నారని మీరు దిగులు పడుతున్నా రెందుకు? మళ్ళీ వుత్తరం రాస్తే, 'చలం' అని రాయండి నా పేరు. ఇక్కడ వెంకటచలాలు చాలా మంది వున్నారు ఈ వూర్లో. నన్నేమీ చెయ్యలేక, నా మీద కసి కొద్దీ 25 ఏళ్ళ తర్వాత, నా డిపార్ట్ మెంట్ వాళ్ళు, ఎప్పుడో పుస్తకాలూ రాశానని, నా మీద తప్పుడు చార్జీలు తీసుకువస్తే, నా కథలు ఫ్రీగా ఇచ్చిన పత్రికలు కూడా ఆ విషయాన్ని నన్ను సమర్థిస్తూ ప్రచురించలేదు.

అందరూ నా 'ఎడ్మయిరర్సే', అందరూ నా స్నేహితులే. అందరూ నా చుట్టూ తిరిగేవారే. నేను వుద్యోగం మానేసిన తర్వాత, మీ దేశపు గొప్పవారు మొహాలు తప్పించుకొని, తిరిగారు నానుంచి. అదండీ మీ దేశం. అంత బెజవాడ పట్టణంలో 20 ఏళ్ళు ఉన్నానే, వెళ్లిపోతుంటే, ఆ ఊరు నుంచి నన్ను పలకరించిన వారు ఒక్కరూ లేరు. ఒక్క శివం గారు తప్ప. అదీ మీ దేశం. ఆ ప్రజల్ని వదలినందుకేనా ఏదో తప్పుకొని వచ్చేసానంటున్నారు. మీ యువతీ, యువకుల దొంగ మొహాలు చూసి, దిగులు పుట్టి వచ్చేసాను 'చివరికి ఇట్లా తయారయ్యారా?' అని. ఇక్కడకి కూడా వచ్చారు ఆంధ్రలలామలు. వచ్చి, మా అందరిమీదా అసత్య ప్రచారం చేశారు ఈ వూర్లో. నేనట ఇంకా రాస్తూ ఉండాలట. ఎందుకు? మీకు తిట్టేందుకు ఎవరైనా ఉండేందుకు. ఇది మామూలే ప్రతి దేశంలో. కానీ, అక్కడ ఏ నలుగురో ఆ రచయిత వైపు చేరి అతన్ని సమర్థిస్తారు వేరే దేశంలో అయితే. కానీ, తెలుగు దేశంలో అదీ లేదు. ఎవరికోసమండీ నన్ను అక్కడ వుండమంటున్నారు? నాకేం అక్కరలేదు. ఎవర్నీ ఏమీ అడగను. అడగలేను. మీ దేశం స్వరూపం చూపిస్తున్నాను అంతే. "(మళ్ళీ ఆంధ్ర దేశానికీ వచ్చేయండి అని అడిగినట్లున్నారు వీరేశలింగం గారు. దానికి ఆయన అలా సమాధానం చెప్పారు )

అలాగే ఈ వీరేశలింగంగారికి వరసనే రాసుకుంటూ 77,78 వరకు కూడా డిక్టేట్ చేయించి రాయించారు. ఆయన రాయలేని సమయంలో కుమార్తె సౌరీస్ గారు రాస్తుండేవారు. చలంగారు రాయలేనటువంటి స్థితిలో, కేవలం మంచానికే పరిమితమైన సంవత్సరాలలో 1978 జూన్ 9 న వీరేశలింగం గారికి, సౌరీస్ గారు రాసిన వుత్తరం.

మీ వుత్తరం అందింది. నాన్న కండీషన్ బాగుంది. భోజనం అంతే చేస్తున్నారు. అంత కంటే ఎక్కువ లేదు. నాన్నకు దుఃఖాశ్రువులు కాదు. ఎమోషన్స్ పట్టలేక అట్లా కన్నీళ్లు వస్తుంటాయి. అవును శిలువ వేసిన క్రీస్తు పరిస్థితి ఇదే. ఏ బాధ వచ్చినా నేను తీసేస్తున్నాను. మీకు చెప్పినా మాత్రం ఏం అర్థమవుతుంది.

ఈశ్వరాశీర్వాదాలతో––––సౌరీస్ “

అలాగే చిట్టచివరిలో చలం గారు కన్ను మూసాక, ఆ మరురోజు సౌరీస్ గారు రాసినటువంటి వుత్తరం.

మే, 8, 1979, వీరేశలింగం గారికి,

మీ వుత్తరం. అవును అదంతా నిజమే. ఆయన బ్రహ్మైక్యం పొందారు. అరుణాచలంలో ఐక్యం అయినారు. ఈశ్వరాశీర్వాదాలతో––––సౌరీస్.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. చలంగారు మొత్తం మిత్రులకు రాసిన ఉత్తరాలు చదివితే నిజమైన చలంగారు కనిపిస్తుంటారు.

చలం గారికి పిల్లలంటే, ఎంత అభిమానంగా ఉండేవారంటే , వాళ్ళ మనవరాలు వాళ్ళ ఊర్లోనే ఉండి, “నాన్నా ! నువ్వు అందరికీ ఉత్తరాలు రాస్తుంటావు. నాకెందుకు రాయవు? “అంటే, ఆయన ఒక కార్డు రాసి, ఆ వూర్లో ఆయనకే పోస్ట్ చేసుకున్నారు. ఆ కార్డు “కిట్టూ”గారు నాకు పంపించారు. దాంట్లో ఇలా రాసారు.

10 – 5 – 1962

కిట్టూకి,

నీ మొహం అంతా ఏమిటి అట్లా ఎర్రగా పూసుకున్నావు కుంకుమ? పువ్వులా? హైదరాబాద్ నుండి జిలేబి ఎప్పుడు పంపిస్తావు? ఆవు దూడ పుట్టింది. మీనా పాలతో నర్తకి గులాబ్ జామ్ చేస్తుంది. నీకు ఎన్ని గులాబ్ జాములు కావాలి. పుల్లా గాడిని, వాడి అమ్మ బాగా తన్నింది. ఏడుస్తున్నాడు. –– ఈశ్వరాశీర్వాదాలతో –––నాన్న.

కుమారి కస్తూరి, రమణ స్టాన్, తిరువణ్ణామలై. “అని రాసి పోస్ట్ చేసుకున్నారు, ఐదారు సంవత్సరాల ఆ చిన్న పాపకు ఆనందం కలిగించడానికి. చలంగారికి పిల్లలన్నా, పువ్వులన్నా, స్నేహితులన్నా అంత అభిమానం, అనురాగం, అంత ఆత్మీయత ఉండేది. ఇవన్నీ కూడా ఈ ఉత్తరాల్లో తెలుస్తూ ఉంటాయి. మరిన్ని వివరాలు తరవాత భాగంలో ......

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 జూన్ 11 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS